తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయండి

- స్మార్ట్ సిటీ మిషన్ కాలపరిమితి పొడిగించండి
- 2,450 ఎకరాల రక్షణ శాఖ భూములు బదలాయించండి
- వరంగల్ సైనిక స్కూల్ అనుమతులు పునరుద్ధరించండి
- కేంద్ర మంత్రులకు సిఎం రేవంత్ విజ్ఞప్తి



రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు గృహనిర్మాణం, స్మార్ట్ సిటీ మిషన్, రక్షణశాఖ భూముల బదలాయింపు తదితర అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బిఎల్‌సి మోడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. రాష్ట్రంలో తాము నిర్మించదల్చిన 25 లక్షల ఇళ్లలో 15 లక్షలు ఇళ్లు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని, వాటిని లబ్ధిదారు ఆధ్వర్యంలోని వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం (బిఎల్‌సి) పద్ధతిలో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ప్రధానమంత్రి ఆవాస యోజనను (పట్టణ)-పిఎంఎవై (యూ) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం తీసుకున్నందున, 2024-25 సంవత్సరానికి పిఎంఎవై (యూ) కింద మంజూరు చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని, రాష్ట్రంలో తాము నిర్మించే ఇళ్లను పిఎంఎవై (యు) మార్గదర్శకాల ప్రకారం నిర్మిస్తామని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. పిఎంఎవై (యూ) కింద ఇప్పటి వరకు తెలంగాణకు 1,59,372 ఇళ్లు మంజూరు చేసి రూ.2,390.58 కోట్లు గ్రాంటు కింద ప్రకటించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అయితే ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగతా నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టే పనులు పూర్తి కానుందున మిషన్ కాల పరిమితిని 2025, జూన్ వరకు పొడిగించాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద తెలంగాణలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో పనులు చేపట్టినట్లు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ కింద వరంగల్‌లో 45 పనులు పూర్తయ్యాయని, రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయని, కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయని, రూ.287 కోట్ల వ్యయంతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగుస్తోందని, ప్రజా ప్రయోజనార్ధం పనులు ముగిసే వరకు మిషన్ కాలపరిమితిని మరో ఏడాది పొడిగించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. రావిరాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్ పరిశోధన కేంద్రం (ఆర్‌సిఐ) ఉపయోగించుకుంటున్న విషయాన్ని ముఖ్యమంత్రి రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంతో పాటు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు తమకు అవసరమని, ఆర్‌సిఐ రాష్ట్ర ప్రభుత్వ భూములు వినియోగించుకుంటున్నందున రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు తమకు అప్పగించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజప్తి చేశారు. వరంగల్ నగరానికి గతంలోనే సైనిక్ స్కూల్ మంజూరు చేసినా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిసినందున అనుమతులు పునరుద్ధరించాలని లేదా తాజాగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి వెంట నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబాబాద్,జహీరాబాద్, భువనగిరి, నల్గొండ, వరంగల్, పెద్దపల్లి ఎంపిలు మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి,కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి అజిత్ రెడ్డి ఉన్నారు.

సహజ మరణానికీ రూ. 15 లక్షలు ఇన్సూరెన్స్ ఇప్పించండి

- యాజమాన్యానికి టిజిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్టీసిలో కార్మికులు, ఉద్యోగుల సహజ మరణానికి కూడా రూ.15 లక్షలు ఇన్సూరెన్స్ వచ్చేలా చర్యలు చేపట్టాలని టిజిఎస్ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) కోరింది. ఈ మేరకు ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎఎంపి అండ్ ఎఎం)కు ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సోమవారం వినతిపత్రం సమర్పించింది. ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, విఎస్ రావు ఆ వివరాలు వెల్లడించారు. టిజిఎస్ఆర్‌టిసిలో సర్వీస్‌లో ఉండి, ఏ కారణంతో అయినా జరిగే సహజ మరణానికి కూడా కనీసం రూ.15 లక్షలు ఆ కుటుంబానికి అందేలా యూనియన్‌బ్యాంక్‌తో సంప్రదింపులు జరిపాలని కోరారు. యూనియన్‌బ్యాంక్‌లో సూపర్ సేలరీ అకౌంటు కలిగి, ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.1 కోటి 15 లక్షలు ఇన్సూరెన్స్ ద్వారా చెల్లిస్తున్నారనీ, ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబానికి అది బాగా సహాయపడుతుందని చెప్పారు. అదే తరహాలో సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి కూడా రూ.15 లక్షలు ఇన్సూరెన్స్ వచ్చేలా స్కీం రూపొందించాలని కోరారు. కార్మికుడు / ఉద్యోగి నుంచి నెలవారీగా వంద రూపాయలు రికవరీ చేసుకొని, కనీస మొత్తం రూ.15 లక్షల ఇన్సూరెన్స్ వచ్చేలా యూనియన్ బ్యాంక్‌తో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్కీంను ప్రారంభించే క్రమంలో ప్రీమియం నెలకు వంద రూపాయలు మాత్రమే ప్రీమియం వుండేలా చూడాలనీ, ఐదేళ్ల తర్వాతే దీనిపై సమీక్ష చేసేలా నిబంధన ఉండాలని సూచించారు. ఇన్సూరెన్స్ చెల్లింపునకూ, హాజరుకు ఎటువంటి సంబంధం లేకుండా చూడాలని కోరారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బి వెంకట్

సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టొద్దు

- సింగరేణికి గనులను కేటాయించాలి : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బొగ్గు గనుల ప్రయివేటీకరణను మానుకొని సింగరేణికి గనులను కేటాయించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణలో భాగంగా తెలంగాణకు ఆయువుపట్టుగా ఉన్నటువంటి సింగరేణిని కేంద్ర ప్రభుత్వం నష్టాల్లోకి నెట్టడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకుండా ఓపెన్ టెండర్లలో సింగరేణి కూడా పాల్గొనాలని చెప్పడం అంటే ఉద్దేశపూర్వకంగా దాన్ని నష్టాలపాలు చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తెలంగాణ నుంచి ఎన్నికై రాష్ట్రానికి చేయాల్సింది పోయి కార్పొరేట్ కంపెనీలకు సహజ వనరులను కట్టబెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో ఉచిత విద్యుత్తు అందుతుందన్నా.. వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయన్నా.. దానికి సింగరేణి లాంటి బొగ్గు గనులే కారణమని తెలిపారు. అలాంటి సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అదానీ నుంచి అత్యధిక ధరలను చెల్లించి బొగ్గును దిగుమతి చేసుకుంటున్నారని, దాంతో వేలకోట్ల రూపాయల ప్రజాధనం కార్పొరేట్ కంపెనీలకు కట్ట పెట్టాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాదు, కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తున్నారని, దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణను నిరసిస్తూ 28, 29 తేదీల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డిఎ అంటే నేషనల్ డిజాస్టర్ అలయన్స్

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ అసమర్థత విద్యార్థుల పాలిట శాపంగా మారుతోందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కెటిఆర్ విమర్శించారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలపై 'ఎక్స్' వేదికగా కేంద్రం వైఖరిని తప్పుబట్టారు. విద్యార్థుల జీవితాలను అయోమయానికి గురిచేసేలా జరిగిన ఈ వరుస ఘటనలు దురదృష్టకరమన్నారు. "జూన్ 4న నీట్ - యుజి పేపర్ లీక్ కాగా.. జూన్ 19న యుజిసి - నెట్ పరీక్ష రద్దు చేశారు. జూన్ 21న సిఎస్ఐఆర్ - యుజిసి - నెట్ పరీక్ష వాయిదా పడగా.. జూన్ 22న చివరి నిమిషంలో నీట్ - పీజీ పరీక్ష సైతం వాయిదా పడింది. బిజెపి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పొంతనలేకుండా ఉన్నాయి" అని మండిపడ్డారు.

నీట్-యూజీ ప్రశ్నాపత్రం ముందుగానే లీక్ అయినట్లు రుజువైనా మోడీ ప్రభుత్వం జులై ఆరో తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. ఎలాంటి కారణాలు చూపకుండా నీట్ - పీజీ పరీక్ష ప్రారంభానికి కొన్ని గంటల ముందు వాయిదా వేశారని ఆక్షేపించారు. ఈ నిర్ణయాల వెనుక ఉన్న లాజిక్ ఏంటని కెటిఆర్ ప్రశ్నించారు. అన్నింటికీ కారణం నేషనల్ డిజాస్టర్ అలయన్స్ అంటూ ఎన్డీయే సర్కారుపై విమర్శలు గుప్పించారు.



బేగంపేట ఎయిర్‌పోర్టులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బేగంపేట ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. సోమవారం ఉదయం బేగంపేట్ విమానాశ్రయానికి గుర్తు తెలియని వ్యక్తులు నుంచి ఓ ఈ మెయిల్ వచ్చింది. అందులో బేగంపేట్ విమానాశ్రయంలో బాంబు ఉందని పేర్కొంటూ వారు బెదిరించారు. దాంతో అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే, తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని మెయిల్ ఐడి ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ తనిఖీల్లో బేగంపేట ఎసిపి గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపి ఏజెంట్‌గా మందకృష్ణ

- ముత్తినేని వీరయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ బిజెపికి ఏజెంట్‌గా మారారని కాంగ్రెస్ వికలాంగుల విభాగం చైర్మెన్, వికలాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు.వికలాంగుల జాతిని బిజెపికి తాకట్టు పెట్టొద్దని కోరారు. సోదరి రజినీకి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఉద్యోగాన్ని కించపర్చడం అనైతికమని విమర్శించారు. వికలాంగులను ప్రభుత్వానికి వ్యతిరేకం చేయటమే మంద కృష్ణ ఉద్దేశమని తెలిపారు. దీని వల్ల మీరు లబ్దిపొంది, వారికి నష్టం చేయాలనుకుంటున్నారా? అని ఆయన్ను ప్రశ్నించారు. స్వార్థ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం వికలాంగులను వాడుకోవద్దని సూచించారు. చిత్తశుద్ధితో ధర్నా చేయాలనుకుంటే..కిషన్‌రెడ్డి ఇంటి ముందు చేయాలని కోరారు. అంతే తప్ప వికలాంగుల మధ్య చిచ్చుపెట్టొద్దని మందకృష్ణకు ముత్తినేని సూచించారు.

సిఎం అంటే కటింగ్ మాస్టర్ కాదు, కరెక్టింగ్ మాస్టర్

- మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నాయకులు వాఖ్యానించినట్టు సీఎం అంటే కటింగ్ మాస్టర్ కాదు, కరెక్టింగ్ మాస్టర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో నిరుపేదలకు, అర్హులకే సంక్షేమ పథకాలని చెప్పారు. దుబారాకు దూరంగా పథకాల అమలు చేస్తామన్నారు. కష్టాల్లో ఉన్న రైతాంగానికి భరోసా ఇచ్చి, వారి పురోగతికి తోడ్పడటమే కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు, రాష్ట్ర అభివృద్ధి రెండు ఈ ప్రభుత్వ ప్రాథమిక సూత్రాలని ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా అలస్యం చేయడానికి కాదు, ఆదర్శం చేయడానికే కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశామని తుమ్మల చెప్పారు.

మల్టీజోన్-2లో 6,013 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీ

- నేటినుంచి ఎస్ఎ ఉద్యోగోన్నతులకు వెబ్‌ఆప్షన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్టీజోన్-2 పరిధిలో 6,013 మంది స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎ) ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ ప్రక్రియ నుంచి రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు ఉన్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో గతేడాది అక్టోబర్‌లోనే సుమారు 750 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. దీంతో మల్టీజోన్-2లో 6,763 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. తాజాగా బదిలీ చేసిన వాటిలో నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 876 మంది ఎస్ఎ టీచర్లు బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లాలో 834 మంది, వికారాబాద్ జిల్లాలో 641 మంది, సూర్యాపేట జిల్లాలో 575 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 562 మంది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 456 మంది, నాగర్ కర్నూల్ జిల్లాలో 451 మంది, మహబూబ్‌నగర్ జిల్లాలో 397 మంది, జనగామ జిల్లాలో 335 మంది, వనపర్తి జిల్లాలో 310 మంది, జోగులాంబ గద్వాల జిల్లాలో 305 మంది, నారాయణపేట జిల్లాలో 271 మంది చొప్పున మొత్తం 6,013 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. మల్టీజోన్-1 పరిధిలో 10,083 మంది, మల్టీజోన్-2 పరిధిలో 768 మంది కలిపి ఇప్పటి వరకు 10,851 మంది ఉపాధ్యాయులు ఉద్యోన్నతులు పొందిన విషయం తెలిసిందే. మల్టీజోన్-2లో మంగళవారం నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ప్రక్రియకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశమున్నది. హైదరాబాద్ జిల్లాలో ఇప్పటికే 750 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు లభించాయి. మల్టీజోన్-2లో రంగారెడ్డి జిల్లా మినహా మిగిలిన 12 జిల్లాల్లో మరో ఆరు వేల మందికి మూడు, నాలుగు రోజుల్లో ఉద్యోగోన్నతులు వస్తాయని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. ఆ తర్వాత మల్టీజోన్-1, మల్టీజోన్-2లో ఒకేసారి సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)కు బదిలీల ప్రక్రియను నిర్వహిస్తారు. దీంతో రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తవుతుంది.

జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె

- ఒపి సేవలు బహిష్కరణ
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మెలోకి దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒపి సేవలను బహిష్కరించారు. వైద్య విద్యార్థుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు ఒపి సేవలు, తాత్కాలిక ఒటి సేవలను బహిష్కరించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులకు వెంటనే స్టైఫండ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లే నిరవధిక సమ్మె చేస్తున్నట్టు తెలిపారు.

గాంధీ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె ప్రారంభమైంది. ఆస్పత్రి ముందు జూనియర్ డాక్టర్లు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలు మినహా ఓపీ, వార్డు విభాగాల వైద్య సేవలు నిలిపివేశారు. ఆస్పత్రిలో మౌలిక వైద్య సదుపాయాలు మెరుగు పర్చాలని, నూతన వసతి గృహాల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా తమ సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ కె.అబ్దుల్ సమాద్, జనరల్ కార్యదర్శి డాక్టర్ గగన్ మాట్లాడుతూ.. గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతినెలా స్టైఫండ్ చెల్లించాలని కోరారు. వైద్యకళాశాలల్లో 15 శాతం సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని, వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో జూడాలు ఒపి సేవలను బహిష్కంచి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా రిమ్స్ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్‌చారి మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి ఓపీ సేవలను బహిష్కరించి, సమ్మెలో పాల్గొన్నామని తెలిపారు.ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, సంగారెడ్డిలోని వైద్య కళాశాలల ముందు జూనియర్ డాక్టర్లు సమ్మె చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు వచ్చే స్టైఫండ్ ప్రతినెలా ఇవ్వాలని, ఉస్మానియా ఆస్పత్రిని ఆధునీకరించాలని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు అన్ని రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. సౌకర్యాలు లేక, మందులు లేక జూనియర్ డాక్టర్లపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు

నా భూమికి మరొకరి పేర పట్టా..

- తనకు పట్టా చేయాలని రైతు ఆత్మహత్యాయత్నం
- జనగామ కలెక్టరేట్‌లో ఘటన



కలెక్టరేట్ గోడపైకి ఎక్కిన రైతు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మరొకరి పేరిట ఉన్న తన వ్యవసాయ భూమిని తనకు పట్టా చేయాలని పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ తన సమస్య పరిష్కారం కావడం లేదన్న మనస్తాపంతో ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం జనగామ కలెక్టరేట్‌లో జరిగింది. జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి చెందిన నిమ్మల నర్సింగరావు (29) అనే యువరైతు తన వ్యవసాయ భూమిని తన పేరిట పట్టా చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా అధికారుల నుంచి నిర్లక్ష్యమైన సమాధానం ఎదురయింది. దాంతో తీవ్ర కలత చెంది కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి బ్యానర్ కట్టి మరీ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన ప్రజలు, పోలీసులు, అధికారులు అతన్ని కిందికి దింపి వెంటనే జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, నర్సింగరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఇది మూడోసారి. గతంలోనూ రెండుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అనంతరం ఇలాగే కలెక్టరేట్‌లో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు స్థానికులు గుర్తుచేశారు. కాగా, గతంలో నిమ్మల నర్సింగరావు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సమయంలో అప్పటి కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ భాస్కరరావు.. ప్రజావాణి నిర్వహించే సమయంలో ప్రతి సోమవారం కలెక్టరేట్ భవనం పైకి ఎవరూ ఎక్కకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత పరిస్థితులు సాధారణంగా ఉండటంతో ఆ విషయాన్ని అంతా మర్చిపోయారు. మరోసారి రైతు ఆత్మహత్యాయత్నం చేయడంతో కలెక్టరేట్ రక్షణ బాధ్యత ఎవరిదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

బిఆర్ఎస్ ఖతమైంది : షబ్బీర్ అలీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఆర్ఎస్ ఖతమైందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం కోసం 11 ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇప్పటి వరకు ఆఫీస్ లేదని పేర్కొన్నారు. కొకాపేటలో బిఆర్ఎస్‌కు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ భూమిని వేలమేసి వచ్చిన డబ్బును రుణమాఫీకి వాడాలని సూచించారు.

భారత్‌మాల స్థానంలో నూతన విధానం

- మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో : రోడ్లు, రహదారుల అభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన 'భారత్ మాల' స్థానంలో కొత్త విధానం రాబోతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో పర్యటిస్తోన్న ఆయన సోమవారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జాతీయ రహదారుల అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించినట్లు చెప్పారు. "హైదరాబాద్-విజయవాడ హైవేను ఆరు లైన్ల రహదారిగా మార్చాలని కోరాం. ఉప్పల్-ఘట్‌కేసర్ మధ్య రహదారి 40 శాతమే పూర్తయింది. ఈ విషయం మంత్రి వద్ద ప్రస్తావించగా.. రహదారి పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్-ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని గడ్కరీ ఆదేశించారు.

వచ్చే రెండ్రోజులు వర్షాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఒక్కటెండ్రు చోట్ల భారీ వర్షం పడే సూచనలున్నాయి.

ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు అక్కడక్కడా పడొచ్చు. ఈ నేపథ్యంలో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలో సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు 17 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా బషీర్‌బాద్ మండలం ఖాసీంపూర్‌లో అత్యధికంగా 5.48 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

చిన్నారిపై బాలుడు లైంగికదాడికి యత్నం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రతిరోజూ చిన్నారిని ఆడిస్తూ ఉండేవాడే ఎదురింటి బాలుడు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ చిన్నారిపై లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో ఆదివారం సాయంత్రం జరిగింది. దౌల్తాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బాలుడు (16) వారి ఇంటి ముందు ఉండే చిన్నారి (5)ని ప్రతిరోజూ ఎత్తుకొని ఆడిస్తుండేవాడు. ఆ చిన్నారి కూడా వాళ్ల ఇంటికి.. వీళ్ల ఇంటికి ఆడుతూ పాడుతూ తిరుగుతుండేది. కాగా, ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ బాలుడు.. చిన్నారిపై లైంగికదాడికి పాల్పడుతుండగా.. గమనించిన చిన్నారి బంధువు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బాలుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం చిన్నారి తండ్రి దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు.

నేటి నుంచి సూత్రా 'మాన్సూన్' వస్త్ర ప్రదర్శన

హైదరాబాద్ : సూత్రా ఎగ్జిబిషన్ జూన్ 25 నుంచి 27వ తేది వరకు హైదరాబాద్‌లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. తాజ్‌క్రిష్ణాలో మూడ్రోజుల పాటు ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని సూత్రా ఎగ్జిబిషన్ అధినేత ఉమేష్ వెల్లడించారు. సూత్రా ఎల్లప్పుడూ సంస్కృతి, సంప్రదాయతలు, ఆధునిక ఫ్యాషన్లు, రాయల్ సొగసులను ప్రతిబింబించు వస్త్ర సముదాయాలు ప్రదర్శిస్తుందన్నారు. దేశంలోని నలుమూలల నుంచి 85 మందికి పైగా డిజైనర్లు, నిపుణులైన కళాకారులు తమ వస్త్ర, అభరణాలన్నింటిని ఒకే వేదిక పైన సందర్శకులకు అందుబాటులో ఉంచుతారన్నారు.

మహిళల సాధికారతే లక్ష్యం

- బిబిజి గ్రూపు చైర్మన్

హైదరాబాద్ : మహిళల భద్రత, సాధికారతే లక్ష్యంగా శంషాబాద్‌లో భరోసా కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బిబిజి) చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.. బాలికలు, మహిళల కోసం సురక్షితమైన కమ్యూనిటీలను రూపొందించడంతో బిబిజి నిబద్ధతకు నిదర్శనమని మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మహిళలు, పిల్లలకు అవసరమైన నమ్మకాన్ని, మద్దతును పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయి అన్నారు. హింస, లైంగిక వేధింపుల బారిన పడిన మహిళలు, పిల్లలకు తిరిగి చక్కటి పరిష్కారాన్ని అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ 449వ టాలెంట్ ఫ్యాక్టరీ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ మహిళా, శిశు భద్రతా విభాగానికి చెందిన డిసిపి సృజన కర్ణం హాజరయ్యారు.

'డబుల్' ఇళ్లను అప్పగించండి

- తాగునీరు, కరెంట్ సౌకర్యాలు కల్పించాలి
- కేంద్రం వాటా నిధులను విడుదల చేయాలి
- సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్
- జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు వెంటనే అప్పగించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లిబర్టీలోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గత ప్రభుత్వం ఓట్ల కోసం ఎన్నికల ముందు ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మధ్యకాలంలోనే లబ్దిదారులకు కేటాయించిందని తెలిపారు. కానీ వాటిని వారికి అప్పగించలేదన్నారు. కేటాయించిన ఇళ్లను లబ్దిదారులకు అందజేయాలని ఎన్ని సార్లు ధర్నాలు చేసినా గత ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇండ్ల సముదాయాల్లో తాగునీరు, కరెంట్, రోడ్డు సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్స్ వద్ద లిఫ్టులు పనిచేయడం లేదని, ఆ ఇళ్లలో నివసించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా.. డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల వద్ద ఎలాంటి పనులూ చేయలేదని తెలిపారు. ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.600కోట్లు అవసరమవుతాయని జిహెచ్ఎంసి కమిషనర్ సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా ఇండ్ల సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వాటా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇళ్లలోకి వెళ్లేందుకు అన్ని సదుపాయాలను కల్పించాలని కోరారు.

సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లబ్దిదారులను ఎంపిక చేశారని, కొందరికి ఇంటి తాళాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా వారు మాత్రం ఇండ్లలోకి వెళ్లకుండా అక్కడ సెక్యూరిటీ గార్డులు అడ్డుకుంటున్నారని తెలిపారు. లబ్దిదారుల సమస్యలను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి లబ్దిదారులకు ఇండ్లను స్వాధీనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు మహేందర్, కెఎన్ రాజన్న, కె నాగలక్ష్మి, నాయకులు ఆర్ వెంకటేశ్, ఎం అజయ్ బాబు, ఆర్ అశోక్, జి కిరణ్, జి నరేష్‌తోపాటు డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సంజయ్ రాజీనామా చేయాలి

- ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన బిఆర్ఎస్ శ్రేణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ బిఫాం మీద గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరినందున.. పదవికి రాజీనామా చేయాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద ధర్నా బిఆర్ఎస్ శ్రేణులు చేశారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి, ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించారు. ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. కష్టకాలంలో ఉన్న పార్టీని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేను నియోజకవర్గంలో తిరుగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పాల్గొన్నారు.

మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారు. కొడిమ్యాల బస్టాండ్ ఆవరణంలో బీఆర్ఎస్ నాయకులు సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

హైదరాబాద్ -శ్రీశైలం రహదారిపై పాడి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు నెలలుగా పెండింగ్ ఉన్న పాల బిల్లులు చెల్లించాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తాండ్ర గేటు వద్ద హైదరాబాద్- శ్రీశైలం ప్రధాన రహదారిపై పాడి రైతులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. విజయ డెయిరీ నిర్వాహకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక్కో రైతుకు దాదాపు రూ.50 వేలకు పైగానే బిల్లులు రావాల్సి ఉందని పలువురు రైతులు వాపోయారు. బిల్లులు వెంటనే చెల్లించకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసు ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. వెంటనే బిల్లులు చెల్లించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర, కొత్త, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల పాడి రైతులు పాల్గొన్నారు.



బాధిత మహిళను పరామర్శిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి

చెంచు మహిళపై దాడి దురదృష్టకరం

- నిమ్స్‌లో ఈశ్వరమ్మకు డిప్యూటీ సిఎం పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెంచు మహిళపై దాడి జరగడం దురదృష్టకరమని, ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగిరి బీరప్పతో మాట్లాడి.. మెరుగైన వైద్యం అందించాలని, పూర్తిగా నయమైన తర్వాతే డిశ్చార్జి చేయాలని వైద్యులను ఆదేశించారు. బాధితురాలి భర్త ఇదన్నకు ధైర్యం చెప్పారు.

అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ చెంచు గిరిజన జాతి మహిళపై దాడి ఘటన మనం తలదించుకునే విషయం అన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి జూపల్లి నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో బాధితురాలిని చేర్పించారని, అనంతరం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చినట్టు చెప్పారు. ఈ విషయం సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, బాధితురాలికి మెరుగైన చికిత్స అందించే అన్ని చర్యలు చేపట్టామన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామని, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్లో ఉచితంగా విద్య అందిస్తామని తెలిపారు. వారికి ఇల్లు కేటాయిస్తామని, వ్యవసాయం చేసుకుంటామంటే పరిసర ప్రాంతంలో పరిసర భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారు.


కీర్తిలాల్ జ్యుయలర్స్‌కు 'టీమ్ మార్క్స్ మెన్' అవార్డు

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల విక్రయ రిటైల్ చెయిన్ కీర్తిలాల్ జ్యుయలర్స్‌కు 2024-25కు గాను అత్యంత ప్రాధాన్యతమైన పని ప్రదేశానికి గాను 'టీమ్ మార్క్స్ మెన్' అవార్డు దక్కిందని ఆ సంస్థ తెలిపింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు జయప్రద చేతుల మీదుగా కీర్తిలాల్స్ రిటైల్ సేల్స్ అండ్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ ముత్తుకుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారని పేర్కొంది. పని ప్రదేశంలో పర్యావరణ వ్యవస్థ, సమానత్వం, రివార్డులు, సామాజిక సమన్యాయం తదితర అంశాల అధారంగా ఈ అవార్డును ఇస్తారని ఆ సంస్థ తెలిపింది.



తహశీల్దార్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

- ఒకరి భూమిని మరొకరికి పట్టా చేసేందుకు సిద్ధమైన తహశీల్దార్
- ఆగ్రహంతో తహసీల్ ఎదుట ధర్నా చేసిన కాలనీవాసులు



ధర్నా చేస్తున్న బిసి కాలనీ వాసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎలాంటి క్రయ విక్రయాలు జరగకుండానే జెట్ట లింగవ్వ పేరున ఉన్న 2.08 గుంటల భూమిలో నుంచి 20 గుంటల భూమిని గాజుల కిష్టయ్య పేరున మార్చడానికి చిన్నకోడూరు తహశీల్దార్ జయలక్ష్మి ప్రయత్నించినట్టు సిద్దిపేట జిల్లా కొండెంగలకుంటకు చెందిన బిసి కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం చిన్నకోడూరు మండల తహశీల్దార్ కార్యాలయం గేటు మూసి అక్కడే కాలనీవాసులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండెంగలకుంట గ్రామానికి చెందిన పుట్ట లింగవ్వ తన పేరునున్న 2.08 గుంటల స్థలాన్ని బిసి కాలనీ పేరున మార్చి తమకు ఇచ్చిందని తెలిపారు. బిసి కాలనీ పేరున ఉన్న స్థలంలో నుంచి 0.20 గుంటల స్థలాన్ని లోపాయికారీ ఒప్పందం ప్రకారం గాజుల కిష్టయ్య పేరున మార్చడానికి తహశీల్దార్ జిల్లా కలెక్టర్‌కు ప్రపోజల్ పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనే తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించామని, దాంతో త్వరలోనే బిసి కాలనీ పేరుకు మారుస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారని తెలిపారు. అయినా ఇప్పటివరకు మార్చకపోవడంతో వారం రోజుల క్రితం జిల్లా కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఫీల్డ్ ఎంక్వయిరీ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించినప్పటికీ చేయలేదని, పైగా ఆరు నెలలుగా తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కారించకపోతే రిలే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. సంఘటనా స్థలానికి చిన్నకోడూరు పోలీసులు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. కాగా, అధికారులకు తప్పుడు రిపోర్టులు ఇస్తూ తమకు అన్యాయం చేస్తున్న తహశీల్దార్ జయలక్ష్మిపై కాలనీవాసులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆదర్శమూర్తులు పైడి లక్ష్మయ్య, సంజీవ రెడ్డి

- జస్టిస్ కోదండరాం

ప్రజాశక్తి కల్చరల్



పాలనా రంగంలో దక్షతతో వ్యవహరించి ప్రజా శ్రేయస్సుకు పాటుపడిన పైడి లక్ష్మయ్య వారి కుమారుడు సంజీవ రెడ్డి నేటి తరాలకు ఆదర్శమూర్తులని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కోదండరాం అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై పైడి లక్ష్మయ్య ట్రస్ట్ ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణలో పైడి లక్ష్మయ్య పైడి సంజీవ రెడ్డిల పేరిట స్మారక పురస్కారాలు ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ కోదండరాం పాల్గొని పురస్కారాలను వీణా వాదన నిపుణురాలు కల్యాణికి, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు, గనుల శాఖ పూర్వ డైరెక్టర్ విడి రాజగోపాల్‌కు, అధ్యాత్మిక వేత్త జగదీష్ బాబుకు, సంస్థ పక్షాన బహుకరించి మాట్లాడారు. తండ్రికొడుకుల పాలన పరంగా సంస్కరణలు చేపట్టారని, వారు రచయితలు కూడా అని వివరించారు. అధ్యక్షత వహించిన తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఏళ్లూరి శివా రెడ్డి మాట్లాడుతూ లక్ష్మయ్య తొలి పార్లమెంట్‌లో నెహ్రూ సమకాలికుడుగా సభ్యుడుగా వుండి తెలుగు వారికోసం పలు పథకాలు తెచ్చారని గుర్తు చేశారు సంజీవ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడు అని పేర్కొన్నారు. ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత కమిషనర్ నరసింహా, దంత వైద్యుడు నారాయణ తదితరులు లక్ష్మయ్య సంజీవ రెడ్డిల సేవా నిరతిని కొనియడారు. స్వాగతం పలికిన రస మయి సంస్థ స్థాపకుడు డాక్టర్ ఎం కె రాము మాట్లాడుతూ పైడి లక్ష్మయ్య సంజీవ రెడ్డి స్మారక పురస్కారాలు ఇప్పటి వరకూ 134 మంది అందుకున్నారని నాటి ముఖ్య మంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు ట్రస్ట్ ను ప్రారంభించారని తెలిపారు.

బీమా పాలసీని అమ్ముకోలేరు

- ఎల్ఐసి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

తాము జారీ చేసిన జీవిత బీమా పాలసీని ఇతర ఏ సంస్థలకు అమ్ముకోవడానికి లేదా బదిలీ చేసుకోవడానికి గానీ వీలుండదని ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) స్పష్టం చేసింది. సంస్థకు సరెండర్ చేయడం తప్పా మరో సంస్థకు విక్రయించడానికి అనుమతించలేదని పేర్కొంది. "లైఫ్ ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌లో భాగంగా పాలసీని సరెండర్ చేయకుండా సెకండరీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి వీలుంది. సరెండర్ చేయడం కన్నా పాలసీని అమ్ముకోవడం ద్వారా అధిక మొత్తాన్ని పొందవచ్చు. ఆ తర్వాత పాలసీ ప్రీమియంలన్నీ కూడా దాన్ని కొన్నవారే చెల్లిస్తారు. మరణం లేదా మాచ్యూరిటీ బీమా ప్రయోజనాలు వారికే దక్కుతాయి." అని ఇటీవల పలు మీడియాల్లో రిపోర్టులు వచ్చాయి. కాగా.. దీనిపై స్పందించిన ఎల్ఐసి అది అవాస్తవమని స్పష్టం చేసింది. తాము ఎలాంటి థర్డ్ పార్టీ సంస్థతో ఒప్పందం చేసుకోలేదని.. తాము జారీ చేసిన పాలసీలను ఎవరికీ విక్రయించుకోవడానికి వీలు లేదని వెల్లడించింది.

నీట్ పై బాలికలకు ఉచిత అవగాహనా తరగతులు

ప్రజాశక్తి - హైదరాబాద్

నీట్ - 2025కు సిద్ధపడుతున్న బాలికలకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్టు మెటామైండ్ అకాడమీ (హైదరాబాద్) తెలిపింది. ఈ మేరకు సోమవారం అకాడమీ చైర్మన్ ఎ మనోజ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 25, 26, 27 తేదీల్లో ఉచిత హాస్టల్ వసతితో నిర్వహించే తరగతుల్లో నీట్‌లో ఎదురయ్యే సవాళ్లు, మొదటి ప్రయత్నంలోనే నీట్ ఎలా సాధించాలి తదితర విషయాలపై మెడికోలు, సీనియర్ అధ్యాపకులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. మొదట రిజిస్ట్రేషన్ చేసుకున్న 100 మందికి మాత్రమే ఈ అవకాశముందని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు 89199 26339లో సంప్రదించాలని సూచించారు.



పార్టీ శ్రేణులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రాజకీయాలు ఇక చాలు.. వ్యవసాయం చేసుకుంటా

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరిక ఆ పార్టీలో చిచ్చురేపింది. ఎమ్మెల్సీ పదవికి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజీనామా చేసే యోచనలో ఉన్నారు. ఈ విషయంపై తన అనుచరులు, పార్టీ శ్రేణులతో చర్చలు జరుపుతున్నారు. బిఆర్ఎస్‌కు చెందిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. తనకు సమాచారం లేకుండా ఆయన్ను పార్టీలో చేర్చుకోవడంపై జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపం చెందారు. ఈ క్రమంలో ఆయన తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గంలో 2014 నుంచి మూడు పర్యాయాలు సంజయ్, జీవన్‌రెడ్డి ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. 2023 ఎన్నికల్లోనూ వీరిద్దరే పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో తనకు తెలియకుండా సంజయ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయన్ను బుజ్జగించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు సోమవారం జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని వారు కోరినట్లు సమాచారం. 40 ఏళ్ల గౌరవప్రదంగా రాజకీయాలు చేశానని.. పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటానని సన్నిహితుల వద్ద జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణాలు



- వంతెనలు లేక.. వాగులు దాటలేక..!
- అత్యవసరంలో వాగులు దాటుతూ కొట్టుకుపోతున్న జనం
- పట్టించుకోని అధికారులు.. పూర్తి చేయని కాంట్రాక్టర్లు
- వర్షాకాలంలో రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే కొండలు, కోనలు.. వాటి మధ్య సెలయేళ్లు..వాగులు, వంకలతో ముడిపడి ఉంటుంది. వీటికి అటు, ఇటు వైపున ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే మధ్యలో వాగులు అడ్డంకి ఉన్నాయి. వర్షాకాలం వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. కొన్ని గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు నిర్మించినా వాటిపై నుంచి వరద ప్రవాహం ఉండటంతో వాహనాలు నిలిచిపోతుంటాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు సులువుగా మారేందుకు గత ప్రభుత్వం పలు చోట్ల కల్వర్టులు, వంతెనలు మంజూరు చేసింది. కొన్ని నిర్మాణం పూర్తికాగా.. మరికొన్ని అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా ఏండ్లు గడుస్తున్నా వంతెనల నిర్మాణాలకు మోక్షం కలగడం లేదు. ఫలితంగా అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆందోళన చెందుతుంటారు. గత ప్రభుత్వం పలు చోట్ల బ్రిడ్జిలు మంజూరు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం కారణంగా జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉండటం కారణంగా నిర్మాణాలు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు..!

అనేక చోట్ల ఆయా గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు అక్కడక్కడ వాగులపై కల్వర్టులు, లోలెవల్ వంతెనలు నిర్మించారు. వర్షాకాలంలో వీటిపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహించడంతో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో అనేక మంది వాహనదారులు ఇతర ప్రత్యామ్నాయ దారుల గుండా ప్రయాణించడం.. లేదంటే తిరిగి వెనక్కి వచ్చేసి వాగుల ప్రవాహం తగ్గిపోయిన తర్వాత వెళ్లడం వంటివి ఇక్కడ సాధారణమవుతున్నాయి. అధికంగా వరదలు సంభవించిన సమయంలో ఆ తాకిడికి కొట్టుకుపోవడం.. తాత్కాలికంగా మరో దారి ఏర్పాటు చేయడం వంటివి ప్రతి ఏటా నిత్య కృత్యం అయ్యాయి. అత్యవసరంగా ఆస్పత్రికి.. ఇతర అవసరాలకు వెళ్లాల్సిన జనాలు.. మరో దారిలేక వాగులు దాటుతూ కొట్టుకుపోతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో అనేక చోట్ల వంతెనలు లేకపోవడం కారణంగా ఆయా గ్రామాల్లో ఉన్న గర్భిణీల కోసం ముందస్తుగానే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బర్త్ వెయిటింగ్ రూంలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ, వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాలకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వాలు, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకొస్తున్నా ఫలితం లేకుండా పోతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం కొత్త ప్రభుత్వమైనా అసంపూర్తిగా ఉన్న వంతెనలతో పాటు కొత్త వాటిని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని జనం కోరుతున్నారు.

- సిరికొండ మండల కేంద్రం నుంచి ఇంద్రవెల్లికి వెళ్లే దారిలో చిక్‌మాన్‌వాగుపై నిర్మిస్తున్న వంతెన. రూ.10.46 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో ప్రారంభించిన ఈ వంతెన పనులు 2023 ఫిబ్రవరిలో పూర్తికావాల్సి ఉంది. కానీ గడువు దాటినా అసంపూర్తిగానే మిగిలింది. ఎప్పటిలోగా పూర్తవుతుందో కూడా అధికారులు చెప్పలేని పరిస్థితి. ఫలితంగా వర్షాకాలంలో చిక్‌మాన్ వాగును దాటలేక ఇరు వైపుల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- కెరమెరి మండలం లఖంపూర్ వద్ద వాగుపై చేపడుతున్న వంతెన నిర్మాణం ఇది. 2016లో పనులు ప్రారంభించారు. ఎనిమిదేండ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ బ్రిడ్జి పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో అటువైపు కరంజివాడ, బొరిలాల్‌గూడ, అందుగూడ, కోట, జనక్‌పూర్, గోర్యగూడ తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగును దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలున్నాయి.

- నార్నూర్ మండలం ఎంపల్లి వాగుపై వంతెన నిర్మాణం కోసం రూ.57లక్షలు మంజూరయ్యాయి. కానీ అటవీ అనుమతులు రావడం ఆలస్యం కావడంతో బ్రిడ్జితో పాటు రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభం కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా గ్రామ సమీపంలోని లంబాడితండా, కొలాంగూడ, గోండ్‌గూడ గ్రామాల ప్రజలు వాగుదాటడానికి అవస్థలు పడుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో సమస్య ఉత్పన్నమవుతున్నా పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గాదిగూడ మండలం ఖడ్కి గ్రామ సమీపంలోని వాగుపై ఉన్న లోలెవల్ వంతెన ఇది. ప్రతి ఏటా చిన్నపాటి వర్షానికి కూడా పై నుంచి వచ్చే వరదతో వాగు పొంగి పొర్లుతుంది. ఫలితంగా అటువైపున ఉన్న గాదిగూడ, ఝరి, దాబా, లోకారి తదితర గ్రామాల ప్రజలు నార్నూర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు రాలేకపోతున్నారు. ఇక్కడ వంతెన నిర్మించాలని జడ్‌పిటిసిలు ఇటీవల జడ్‌పి సమావేశంలోనూ ప్రస్తావించారు.